# ఎమ్.సి.వరాహం

నా పేరు ఎమ్.సి వరాహ మూర్తండి. నాకు ఒక ముసలి తల్లి, మధ్య వయస్కురాలైన భార్య, ఇద్దరు పిన్నవయస్కురాళ్లైన కూతుళ్ళు ఉన్నారండి. ఒక భార్య అని ఎందుకన్నానా? ఎవరికైనా అంతకంటే ఎక్కువ ఉంటారా? అని ఆశ్చర్య పోతున్నారు కదూ?కరెక్టు సార్! అల్లా ఉండకపోవటమూ కరెక్టే! పెద్ద మనిషన్న వాడల్లా ఆశ్చర్యపోడమూ కరెక్టే! మీరు పెద్దమనిషన్న నా ఊహా కరెక్టే! కాని ఒక మధ్య వయస్కురాలైన భార్య అని నేను అనడంలోనే ఒక పడచు

వయస్కురాలైన భార్య ఉండాలన్న నా కోర్కె ధ్వనిస్తోందిట! అని నా ఏకైక భార్య అంటుందండి. పైగా "అవకాశం ఉన్న ప్రతి మగవెధవా అయిదుగుర్నయినా పెళ్ళాడాలని ప్రయత్నిస్తాడు" అని మా ఆవిడ ధృఢనమ్మకమండి. అందులో నాలాగా కథల్రాసే వాళ్ళు తిరిపెమున పరమేశ్వరుడి లాగానే మెయిన్‌టెయిన్ చెయ్యలేక పోయినా ఇద్దరు భార్యలుండటం స్టైల్ అనుకొంటారటండీ!

అఫ్‌కోర్స్ మీరు పెద్దమనిషి కదా! మీరుమరీ నాగురించి అంత నీచంగా ఆలోచించరని నాకు తెలుసనుకోండి. నేను చూడగానే మీలాంటి వాళ్ళనెవర్నయినా పెద్దమనిషని ఒప్పుకుంటానా అండీ! మా ఆవిడ ఒప్పుకోదండి. మగవాళ్ళెవరూ సహజంగా పెద్దమనుషులైన దాఖలాలు లేవటండీ. ఎందరో ఎంతో ప్రయత్నిస్తే కొద్దిమంది కొద్దిగా అవుతారుటండి.

ఆవిడల్లా అంటే మగాడైనవాడి కెవరికైనా కోపం రాదండీ? మహా మహా మీకే వస్తుంది. నాకు రాదా! అందుకని నేనో కుళ్ళు జోక్ వేస్తానండీ "మరే ఆడవాళ్ళయితే ఏ ప్రయత్నం ఎవరూ చెయ్యకుండా అందరూ అవుతారు" అంటూ, ఇప్పుడు కోపం మా ఆవిడకి వస్తుందండి. ఆ కోపం చూడాల్సిందే కాని వర్ణించడానికి నారచనా శక్తి చాలదండి.

ఇంతకూ మా ఇంట్లో నేను తప్పించి అందరు ఆడవాళ్ళేనని చెప్పాను కదా! నేనూ వాళ్ళూ సమానులం కామండి. సంఖ్యలోనూ, అన్నింటా వాళ్ళే అధికులు. వాళ్ళమాటే పాటియై ఇంటచెల్లు. నాలుగు కంచుగంటలు అదేపనిగా మోగుతుంటే నాపలుకు బంగారమై పోదామరి. అయిపోయిందండి. దానికి తను అదేలెండి మా ఆవిడ "అనే రెండు మాటలూ బాణాల్లాగా నాటేసి ముంగిలా కూర్చుంటారు" అంటుందండీ తన స్నేహితుల్తో.

మా ఆవిడ స్నేహితులని స్నేహితురాళ్ళు అనాలని నేనంటానండి. రాళ్ళూరప్పలూ అన్నీ మగాళ్ళేట. రామ్మోహన'రాయి' లు బంగా'రప్ప'లూ నిదర్శనాలుట. అందుకని స్నేహితురాళ్ళు పుంలింగాలుట. స్నేహితి అన్నమాటకి బహువచనం స్నేహితులుట. రచయితలు రచయిత్రులు అన్న భేదం సృష్టించింది కూడా సెక్సిస్టు దృక్పథంతో పురుషులేనట. మీరు నమ్ముతారా సార్? నేను నమ్మను! రచయిత్రి అంటే ఓ అందమైన అమ్మాయి గుర్తువస్తుంది చక్కగా. అదే రచయిత అంటే ఏముంది గండుపిల్లి మొహం వాడూ, గుర్తుకు వస్తారు. అన్నట్టు మర్చిపోయాను చెప్పటం. రచయిత్రులు అందంగా ఉంటారని నేను మీరే కదా అని ధైర్యంగా అనేశాను. మా ఆవిడ దగ్గర అనకండి.

నాకు చిన్నప్పుడు మా పిల్లలు పట్టుపరికిణీలు, జాకెట్లూ వేసుకొని పూలజడలు వేసుకొని కాళ్ళకి పట్టాలు కట్టుకొని ఘల్లుఘల్లుమని తిరుగుతుంటే ఇంట్లో ఇద్దరు లక్ష్ములు తిరుగుతున్నట్టు ఉండేదండి. అందుకని ఓరోజున

"తెలుగు పాపకి పరికిణీ అందం" అన్నానండి.

అంతే అన్నానండి. ఇంకేం అనలేదండీ ఒట్టు!

అంతే తను వెంటనే ఓ క్లాసు తీసుకొందండి.

"తెలుగు వాడికి కండువా అందం. మీరు రేపట్నుంచి కండువా వేసుకోండి. పంచెందుకు కట్టుకోరు? అందులో మీరు కనపడరని తెలిసికూడా నల్లసూటెందుకు వేసుకొంటారు? సాంప్రదాయాల బరువు, దాన్ని కాపాడాల్సిన బాధ్యత మా మీదపూర్తిగా ఎందుకు పెట్టేస్తారు మగాళ్లు? కన్వీనియంట్ డ్రెస్ మీకూ కంబర్‌సమ్ డ్రెస్ మాకూనా? ఈ రూల్సు పెట్టినవాళ్లెవరు? పూర్వం ప్రవరాఖ్యుడిలాగానో పాత సినిమాల్లో నాగేశ్వరరావు లాగానో మీరు బారు జుట్టు పెంచుకొని చెవులో ఒకటి, తలలో ఒకటి పువ్వులు పెట్టుకోండి. మీరు చెయ్యరు నాకు తెలుసు. ఒక నిముషంలో తల దువ్వేసుకొని తయారైపోగల సుఖం మీకు, గంటల తరబడి ముస్తాబవుతామన్న అపనింద మాకు! పురుషాధిక్యప్రపంచంలో ఇంతకంటే ఏమిటి ఆశించగలం?"

నల్లసూటులో నేను కనపడను అంటే నేను నల్లగా ఉంటానని ధ్వనండి. తను తెల్లగా ఉంటుంది కదా! పెళ్లాం తెలుపైతే పిల్లలు తెలుపు అంటారు కదండి మీ లాంటి అనుభవజ్ఞులు. అందుకే తెలుపే టెన్ థవ్‌జెండ్స్ అనుకొని ఓ పదివేలు తక్కువకే ఒప్పుకున్నానండి. తనకా కృతజ్ఞత లేదు.

ఇంతకూ మా ఆవిడ అన్నమాటలకి మరోడు మరోడు అయితే మొహం తిరిగి పడిపోవాల్సిన మాటండీ. నేను మహామొండిఘటాన్నండి. మా ఆవిడ కండువా వేసుకోమంది కదా అని ఆమర్నాడు మా బావమరిది తనకూతురు పెళ్లిలో పెట్టిన పంచ చక్కగా మడతపెట్టి ఇస్త్రీ చేసుకొని మెళ్లో వేసుకొన్నానండి. ఆవిడ దానికీ ఉడుక్కుంది.

"మీరసలే ఆరడుగులమనిషి. మా అన్నయ్య అయిదడుగుల మూడంగుళాలు బుడంకాయ. మీరు మా అన్నయ్యపెట్టేపంచలు అతగాడికి చాల్తాయి కాని మీకు మోకాళ్లు దిగవు. మీరు మొన్న తలంటికి దాన్ని గావంచాగా చుట్టుకొని వచ్చినప్పుడే నాకు అర్థమైపోయింది. ఇవాళ కండువాగా ధరించి బడాయిలు పోనక్కర్లేదు" అంటూ దులిపేసిందండి. ఈ మనిషితో నేను కనక వేగుతున్నాను.

ఇంతకూ మా పిల్లలకి డిప్పకొట్టించేసిందండీ కాన్వెంటులో జేర్చిన రోజున. ఆపైన వాళ్లకి లాగూలు చొక్కాలు పాంట్లూ, చొక్కాలు తొడిగి మగరాయుళ్లలాగా పెంచిందండి. రాయుళ్లు రాయుళ్లే. రాళ్లు రాళ్లేనండి. రెండూ ఒకటి కావండి.

"పాంట్లవేల?" అన్నానండి ఒకరోజు.

"పరుగెత్తి బస్సులెక్కేవాళ్లకి చీరలు కాళ్లకి బందాలు పడ్తాయి. పి.టి.ఉష చీరలు కట్టుకొని పరుగెత్తగా మీర్చూశారా?" అని నిలదీసిందండి. మగవాళ్లం, మనం వెస్టర్నైజ్ అయి ఆడవాళ్లనవనీకుండా అణిచి పెడ్తున్నాంటండీ. నన్నంటే అంది కట్టుకొన్న వాడిని కనక భరిస్తాను. మిమ్మల్నెందుకండీ అనడం?

అయితే మా ఆవిడకి ఓ ఆడగుణం మాత్రం పోలేదండీ! అది అవసరానికి మించి చీరలు, బంగారం కొనటం. దాన్నీ సమర్థించుకోగలదండి మా ఆవిడ.

"పిల్లలు కన్వీనియన్సుకి పాంట్లు వేసుకొంటున్నారు కాని అసలు చీరలే కట్టుకోరా? చూడీదార్లే తొడగరా? ఆడపిల్లలు లక్షణంగా ఉండాలంటారు కాని డబ్బు మాత్రం ఖర్చు కాకూడదంటారు. అదీ మీ కన్వీనియెన్సు బట్టే ఉండాలి!" ఆ సమర్థించుకోడం లోను ఓవిసురు ఓ గాథతా ఉంటాయండి.

మా పిల్లలు వాళ్ల స్నేహితులు అంతా ఒక్కలాగా ఉంటారండీ. వాళ్లంతా ఏకలింగీయులు అంటే యూనిసెక్సు అనే ఆలోచనా బడికి చెందిన వారండి. కాని మా పిల్ల చదువులు పూర్తయి ఆఫీసుల్లో ఉద్యోగాల్లో చేరాక సమస్యలు తలెత్తాయి. ఆ ఆఫీసుల్లో ఆడవాళ్లు, మగవాళ్లు, అని రెండు జాతులు విడివిడిగా ఉన్నాయి. అందులో మగవాళ్ల మా పిల్లల్తో వీళ్లు ఆడపిల్లలన్న స్పృహ లేకుండా వీళ్లచేత కాఫీలకి ఖర్చు పెట్టిస్తూ వీళ్ల స్కూటర్ల వెనకాతల రైడు తీసుకుంటూ, వీళ్ల బరువులు వీళ్లనే మోసుకోనిస్తారుట. మిగిలిన ఆడవాళ్ల విషయంలో మాత్రం బోలెడు గాలెంట్రీ చూపిస్తారుట,చీకటిపడ్డాక ఇంట్లో దింపడం లాంటివి చేస్తూ ఆడవాళ్లేమో, "మీరు చక్కగా వాళ్లల్లా డ్రెస్సయి వాళ్లతో సమానంగా తిరుగుతారు. మీ ధైర్యం మా కెల్లా వస్తుంది" అంటూ భయాలు సిగ్గులు ఒలకబోస్తారుట.

వాళ్లల్లో వాళ్లమాత్రం "ఈ డ్రెస్సు చాలా బాగుంది ఎక్కడకొన్నావు?" అనో "ఈ నగ ఎంతో బాగుంది.ఎంత ఖరీదు? అంటూ కాంప్లిమెంట్స్, ఇన్ఫర్మేషన్ ఇచ్చిపుచ్చుకొంటూ ఉంటారుట. వీళ్ల డ్రెస్సుని మెచ్చుకొన్నా, వాళ్లు కొనుక్కోవలసిన ముచ్చట పడరుట. ఇది పుండైతే, దానిమీద కారం మగవాళ్లు జల్లుతారుట.

"ఈ క్రాపెక్కడ చేయించుకున్నారండి చాలా బావుంది" అనో

"ఈ జీన్సు నేనూ కొనుక్కుందామనుకొంటున్నాను" అనో.

దాంతో మా అమ్మాయిలకి కాంప్లెక్సు పట్టుకొంది, పెళ్లీడు వచ్చినా తాము మగపిల్లలని మిగిలిన ఆడపిల్లలాగే ఎందుకు ఆకర్షించలేకపోతున్నాం అన్నది. ఏడాది తిరిగే సరికి ఆఫీసుల్లో కొన్ని జంటలకి పెళ్లిళ్లయిపోయాయి. అప్పుడండి మా పెద్దమ్మాయి నన్నడిగింది, "ఎందుకిలా జరుగుతోంది?" అని. నేను జవాబు చెప్పబోతుండగా మా ఆవిడ,

"మగవాళ్ల సర్వసాధారణంగా వెధవలు కనక" అని జవాబు చెప్పేసిందండి.

నేను మామూలుగా అయితే ఊరుకొనేవాడినేమోగాని విషయం కడుగంభీరమైనది, కదా అండీ! అందుకని,

"భేదం ఆకర్షణకి మూలం. వ్యతిరేక ధృవాలు ఆకర్షించుకొంటాయి. ఆడా మగా కాంపిటీటర్స్ కాదు కాంప్లిమెంటరీ! కాంక్రీటు స్టీలులాగా. మనలోటు అవతలి వాళ్ల స్ట్రాంగు పాయింట్ అవటమే ఆకర్షణ." అన్నానండి. అది విని మా ఆవిడ,

"మీరుత్త ఎమ్సీవరాహం" అందండి.

"అది నాపేరే కదా!" అన్నానండి.

"అనే కదా నేనూ అన్నాను. పేరుకు తగ్గట్టు మీ భావాలుంటాయి" అందండి తను.

నాకు వళ్లు మండిందండి. మండదండీ మరి.

"నువ్వు అన్నీ పిల్లల మీద రుద్దుతున్నావు కాని. నువ్వెందుకు పాంట్లు వేసుకోడం లేదు. నువ్వెందుకు డిప్ప కొట్టించుకోడం లేదు. నువ్వెందుకు మంగళసూత్రాలు ధరిస్తావు?" అని భలే దెబ్బ కొట్టానండి. ఆ మంటవల్ల "నాకు చిన్నప్పటినుంచి పాంట్లు వేసుకోవాలని సరదా. కాని మా అన్నయ్యలు పడనివ్వలేదు. మా ఇంట్లో వాళ్లమాటే చెల్లింది. నేను డిప్ప కొట్టించుకుంటే మీరు చచ్చిపోయినంత గొడవ జరుగుతుందని చేయించుకోలేదు. బంగారంవి కనుక మంగళ సూత్రాలు వేసుకొంటున్నాను. పసుపు కొమ్మైతే ఎప్పుడో పారేద్దును. నా పిల్లలకి నాలాగానే ముచ్చట్లుంటాయని ఊహించగలను కనుక నేను ప్రోత్సాహిస్తున్నాను". అని మా ఆవిడ కూడా చాలా గట్టిగానే జవాబు చెప్పిందండి.

మా ఇంగ్లీషు మీడియం తెలుగు పిల్లలకి ఆ సమయానికో సందేహం వచ్చిందండి.

"వరాహం అంటే ఏమిటి? అని అడిగారండీ. దాన్తో మాఆవిడ ఒకించుకు తడబడిందండి. అది చూస్తే నాకు ఆనందం వేసి,

"పిగ్" అని ప్రకటించి విజయఢంకా మోగించాను. అప్పుడు ధైర్యంగా మా ఆవిడ,

"ఎమ్సీ వరాహం ఏమిటో తెల్సింది కదా!" అని నవ్విందండి.

ఆవిడకి పాపం నన్ను ఇంగ్లీషులో పిగ్ అనటానికి భారత నారీ సాంప్రదాయం అడ్డు వచ్చిందన్నమాట. పోన్లెండి మా ఆవిడ ఆపాటి సాంప్రదాయం పాటిస్తోంది. అదే టెన్‌థవుజెండ్స్! ◖

చివర రచయిత మాట: ఈ మధ్య నేను ఫెమినిస్టు రచయితనై పోతున్నానని నా సహ రచయితలు వివినమూర్తి, వల్లంపాటి వెంకట సుబ్బయ్యగార్లు వేళాకోళం చేస్తుంటే కాంప్లెక్సు పట్టుకొని ఎల్లాగైనా ఎమ్.సి.పి. మందికి నచ్చే కథ వ్రాసి కన్ఫామ్ అయిపోవాలని ఈ ప్రయత్నం చేశాను.

(ఆహ్వానం, జనవరి '95)